# మారిన మనసు

## 'వాచస్పతి'



కళ్ళెంలేని కాలానికి ఉన్న విలువ అంచనా వేయడం కష్టం. ఒకొక్క సందర్భంలో ఒక్క క్షణం యుగాలకు మించిన ప్రాధాన్యం సంతరించుకొంటుంది. క్షణిక వ్యామోహానికి దాసులైనవారు గుర్తించలేరు.

---

"**అయితే** అతను అపర ప్రవరాఖ్యుడనా నీ ఉద్దేశం?" కిటికీలోనుంచి తోటలోనికి చూస్తూ అడిగింది కౌముది.

టేబిలుమీద మోచేతులాన్చి మోచేతుల్లో గడ్డం పెట్టుకుని దీర్ఘాలోచనలో నిమగ్నురాలైన అరుణ చకితయై తళతళలాడే మీనాల్లాంటి కళ్లనెత్తి కౌముది ముఖంలోకి ఓ క్షణం చూసింది. కౌముది కిటికీ దగ్గర్నుంచి తిరిగివచ్చి అరుణ కెదురుగా కుర్చీలో కూర్చుంది.

"మాట్లాడవేం?" గద్దించింది కౌముది.

"ఎవరి సంగతి?" అప్పుడే ఈ లోకంలోకి వచ్చిపడ్డ అరుణ ప్రశ్నించింది.

"నంగనాచిలా ఏమిటా ప్రశ్న? ఇంతసేపూ వాగిందంతా ఏమైంది? చెవుల్లోనుంచి దూసుకపోయిందా? హుఁ.... నీ విషయం నాకు తెలీదూ? బుద్ధిలేక పనిగట్టుకుని వచ్చాను." చివాల్న కుర్చీలోనుంచి లేచి విసవిసలాడుతూ కిటికీ దగ్గరకు వెళ్లింది అరుణ కుర్చీలోనుంచి లేచి కిటికీదగ్గరకు వెళ్లి కౌముది భుజంమీద ఎడం చేయివేసి కుడిచేత్తో ముఖం తనవైపు తిప్పుకుని, "అంత కోపమైతే ఎలా, కౌమూ?" అంది.

"కోపం! నా కోపం నిన్నేం చేస్తుంది? నాకేం నీలాగ లక్షలున్నాయా? పేదవాని కోపం పెదవికి చేటని నాకు తెలుసు!"

"అబ్బబ్బ! నీతో మాట్లాడ్డమే కష్టం తల్లీ! మాట మాట్లాడితే లక్షలు లక్షలంటావు! లక్షాధికారి ఇంట్లో పుట్టడం నేను చేసుకొన్న మహాపరాధమా?" బాధగా అంది అరుణ.

"అపరాధం కాదు. అదృష్టం!" క్రింది పెదవి నొక్కి వెటకారంగా అంది కౌముది.

"ఎంత ఈర్ష్య!"

"ఎందుకో!" వెక్కిరించింది కౌముది.

"తెలీదూ?"

"నోర్ముయ్! నీ లక్షలు నాకక్కర్లేదు! కావాలని ఏ రోజూ కోరుకోను. భావశూన్యమైన ఈ జీవితానికి కుళ్లుకోవడంకూడానా? హుఁ..." కసినంగా నవ్వి అంది కౌముది.

అరుణ కళ్లు జాలిగా నవ్వాయి. "భావశూన్యమా! అవును....అలాగే అనుకో. పదేళ్లుగా మన మధ్య ఉన్న వాగ్వివాదమేగా యిది! ఈ రోజుతో పోతుందని అనుకోవడం అవివేకం! డబ్బున్నవాళ్లపట్ల ఈర్ష్య....."

"ఈర్ష్య! నరకంలో ఉన్నవాళ్లను చూసి ఎవరే అమ్మడూ ఈర్ష్యపడేది!" ఎగతాళిగా అంది.

"పోనీ....అసహ్యం....అవునా?"

కౌముది అదోరకంగా నవ్వింది.

"చిన్నతనంనుంచీ నీ సరసాల్లో పండి పోయింది. ఇంకిక్కన్నుగానీ చేయించుకున్నావేమిటి?" నవ్వి అంది అరుణ.

"ఊఁ....నువ్వేగా మీ డాక్టర్ను పంపి యిప్పించావు!"

అరుణ హృదయం కలుక్కుమంది.

"ఈ రోజు నీ మనసేం బాగున్నట్లు లేదు. లేకుంటే నీ అరుణను గురించి యింత అన్యాయంగా ఎందుకు మాట్లాడతావు?" ఆకాశంలోకి చూసి మందహాసం చేసింది అరుణ.

కౌముది కనుకొలకుల్లోనుంచి అరుణ వైపు చూసింది. బాధా చిచికలు అరుణ ముఖంలో స్పష్టంగా కనిపిస్తున్నాయి.

"అరూ! ఈ పెడుమనసు ఒక్కోసారి నిన్ను శంకిస్తుంది. నువ్వు డబ్బుమనిషివి కాదని నాకు తెలుసు. ప్చ్! భగవంతుడు ఈ హృదయాన్ని దేనితో తయారు చేశాడో! అయినా నీకీ రోజు యింత సరాకెందుకు వచ్చింది చెప్పు?" కిటికీలోనుంచి దూరంగా చూస్తూ అంది.

"సరాకు, చికాకు నాకు కలగకూడదా? నేను మనిషినన్నమాటఎందుకు మరిచిపోతావు, కామూ?" గొణిగింది అరుణ.

"నిన్నెందుకిలా బాధిస్తానో నా కర్థంకాదు. ఇక నే వెళ్తాను." వ్యథిత మనస్కయై అంది కౌముది.

"అసలు విషయం చెప్పకుండానే వెళ్తావా?" తీరబోయిన గొంతుతో అంది అరుణ.

"నువ్వు వినే స్థితిలో లేవు. నేను చెప్పే స్థితిలో అంతకన్నా లేను."

"అంతా నీ యిష్టం! నన్ను శాసించడం నీకు బాగా చాతనవును." మెల్లగా నవ్వి అంది అరుణ.

కౌముది నవ్వకుండా ఉండలేకపోయింది.

"ఊఁ....అయితే నిన్ను నేను శాసిస్తున్నానా? ఎంతమాటన్నావు! శాసించేవాళ్ళు వేరే ఒకరున్నారని తెలీదూ?" చిలిపిగా అరుణ కళ్ళల్లోకి చూచి అంది కౌముది.

"అంతవరకూ!" అరుణ కళ్ళు తళతళలాడాయి.

కౌముది అరుణ భుజంమీద చేయివేసి స్నేహపూర్వకంగా నవ్వింది.

"కాఫీ తీసుకుందాం....తర్వాత చెబుదువుగానీ...."

"చిత్తం!"

ఇద్దరూ టేబిలు ముందు కూర్చున్నారు. పనికుర్రాడు కాఫీ, బిస్కట్లు టేబిలుమీద పెట్టి వెళ్ళాడు.

అరుణ కాఫీ కలిపి కౌముదికిచ్చి తనో కప్పు తీసుకుంది.

"ఇంతకూ ఎవరి విషయం నీవు చెప్పడం?" బిస్కటు కొరుకుతూ అంది అరుణ.

"కాబోయే మీ శ్రీవారిని గురించే!"

"ఓ!" అరుణ చేతిలోని బిస్కెటు జారి

# మారిన మనసు

క్రిందపడింది. కౌముది అదోరకంగా నవ్వింది.

"అంటే....నువ్వు చెప్పబోయేది...."

"అవును.... నేను చెప్పబోయేది యింకో వారం రోజుల్లో నీకు తాళి గట్టబోయే శ్రీ శ్రీ కృష్ణమూర్తి ఎమ్. ఎ., పిహెచ్. డి. ని గురించి ....ఏం? అర్థమైందా?"

బల్ల గజగజలాడింది! దానితోపాటే అరుణ హృదయం!

"ఆయన్ను గురించి చెప్పేందుకు ఏముంది?" నీరసంగా అంది.

"ఏముంది! మహాభారతమంత గ్రంథముంది! అయితే అదంతా నేను చెప్పలేననుకో!"

"కామూ! ఏమిటిది? నన్ను పరీక్షిస్తున్నావా? అయినా ఆ అవసరం నీకెందుకు?"

"పరీక్షించాల్సిన అవసరం నాకెందుకు? ఉన్న విషయం చెబుతున్నాను. అదయినా మీ అందరి అన్యాయపు ఇనుపపాదాల క్రిందపడి నలిగిపోతున్న అభాగ్యురాలి కోసం చెప్పవలసి వస్తోంది." అరుణ ముఖంలోకి చూసి అంది.

"అభాగ్యురాలా?"

"అవును. నువ్వు న్యాయం చేకూర్చగలవని... అందరిలాంటిదానివి కాదని చెప్తున్నాను."

"నామీద అంతటి విశ్వాసం ఉన్నందుకు సంతోషం! చెప్పు, కామూ! ఎవరా అభాగిని? నాకూ, ఆమెకూ సంబంధ మేమిటి? నా అక్రమమైన ఇనుప పాదాల క్రింద ఆమె నలిగిపోతుందా? నేనంత క్రూరంగా ఏరోజూ ప్రవర్తించలేదే? తెలియక చేసినా తప్పని చెప్పేందుకు నావెంట నీవెప్పుడూ ఉన్నావన్న సంతృప్తి యిప్పటివరకూ నాకుంది. ఈరోజు ఆ తృప్తిగూడా మిగలకుండా పోతుందేమోనన్న



ఎక్కడికో?

(పేపర్ కట్టింగ్)

చిత్రం—కొక్కులు వి. వి. ఎస్. ఆర్.

(మంగళగిరి)

భయం నా హృదయాన్ని పీడిస్తున్నది." టేబిలు మీద వేళ్ళతో పిచ్చిగీతలు గీస్తూ నెమ్మదిగా అంది.

"అతను నీవనుకుంటున్నంతటి ప్రవరాఖ్యుడు కాదని చెప్పవలసి వచ్చినందుకు చింతిస్తున్నాను."

"ఏమిటో చెప్పు?"

"నన్ను విశ్వసిస్తావనుకుంటాను."

"ఊఁ....." అరుణ తల ఆడించింది.

"కృష్ణమూర్తిని గురించి నీకేం తెలుసు?"

"ఏం తెలుసు? అందరికీ తెలిసిన విషయాలే నాకూ తెలుసు....."

"ఆ తెలిసిన విషయాలే చెప్పమంట...."

"దూరపు బంధువు. మొన్ననే పిహెచ్. డి. చేశాడు. అంత ఉన్నవాళ్ళు కారు. తెలివిగలవాడు గనకే పైకి రాగలిగాడు. చదువుతోపాటు సంస్కారం కలవాడు."

"ఇంకా?" కనుబొమలు చిట్లించి అంది కౌముది.

"ఇక చెప్పాల్సింది నువ్వే!"

"ఒక్క వాక్యంలో చెబుతాను. గ్రంథమంతా చెప్పే ఓపిక ఇప్పుడు నాకు లేదు. నిన్ను రెండో పెళ్లి చేసుకోబోతున్నాడు!"

అరుణ చిత్తరువులా ఉండిపోయింది. రెండు నిమిషాలు ఒక్కమాటా మాట్లాడ్లేకపోయింది.

"ఏమిటి?...ఏమిటి, కామూ, నీవంటున్నది?" అరుణ తడబడే గొంతుతో అంది.

"నువ్వు మరో స్త్రీ జీవితాన్ని నాశనం చెయ్యబోతున్నావు!"

"నేనా?"

"నువ్వే!"

"ఎలాగ?"

"కృష్ణమూర్తిని చేసుకుని!"

"పెళ్లిచేసుకోవడం తప్పేనా?"

"పెళ్లయినవాణ్ణి...."

"అతనికి పెళ్లయిందా?"

"ఒకవిధంగా చూస్తే....."

"అంటే?"

"సంఘం సాక్ష్యమివ్వదు."

"ఓ! మరి అలాంటప్పుడు...."

"అది పెళ్లి కాదంటావు."

"నేను కాదు..."

"లోకం?"

"ఊఁ... తప్పకుండా అంటుంది."

"నాక్కావలసింది నీ విషయమే!"

"నా విషయం?"

"అవును."

"కానీ అతను ఒప్పుకోవాలి."

"నువ్వు ఒప్పించాలి."

"నేనా?"

"ఏం, భయమా?"

"భయం కాదు....."

"మరి?"

"అతను ఒప్పుకుంటాడా?...."

"ఒప్పించాలని చెబుతున్నాను!"

అరుణ ఓ నిమిషం కిటికీలోనుంచి దూరంగా చూసింది.

"కామూ!"

కౌముది తలెత్తి చూసింది.

"నీకు ఆవేశం జాస్తి!"

"పేదవాళ్ళకుంది అదొక్కటే!"

అరుణ హృదయం బాధతో మూల్గింది.

"ఎప్పుడూ కాటువేసేందుకు సిద్ధంగా ఉన్న నాగినిలా ఉంటావు! నీ మనస్తత్వాన్ని అర్థం చేసుకున్నా మార్చలేక పోతున్నాను, కామూ!" విచారంగా అంది అరుణ.

"ప్రపంచంలో నువ్వు చెయ్యాలనుకుంటే ఎన్నో ఘనకార్యా లున్నాయి! నన్ను మార్చడమే జీవితలక్ష్యంగా పెట్టుకోకు!" వ్యంగ్యంగా అంది కౌముది.

"శిలాహృదయం! ఈ హృదయం ద్రవించాలంటే హృదయమే వేణువుగా చేసి మధుర గానం ఆలపించగలవాడే రావాలి!" నవ్వి అంది అరుణ.

"వస్తాడు! కానీ ముందు నా ఆవేశానికీ, ఈ కార్యక్రమానికీ సంబంధమేమిటో సెలవి య్యండి మహారాణీ!"

"ఓ....." అరుణ నవ్వి తలెత్తి ఓరగా చూసింది. కౌముది ముఖం క్రోధంగా ఉంది.

"నేను అతన్ని పెళ్ళి చేసుకోలేనని చెప్తాను. కానీ...."

"ఊఁ...."

"అతను మరోచోట ప్రయత్నం చెయ్యడని ఎలా చెప్పడం?" తలవంచి మెల్లగా గొణిగింది.

"అవును! కనుక నువ్వుమటుకు వృథాగా అవకాశం ఎందుకు వదులుకోవాలి? బాగా చెప్పావు! నీ నైజం చూపించావు. ఎంత చదివినా, ఎన్ని మాటలు చెప్పినా ఇంటా వంటా లేని సాను భూతి నీకెలా వస్తుంది? అలా రావాలనుకోవడం మటుకు తప్పుకదూ? బ్రతికినా, చచ్చినా ఒకే విలువ గలవాళ్ళం మేము! అలాంటిది ధూళిలో కలిసిపోయినా చింతెందుకు? రాణించవలసిన వాళ్ళు మీరు! మీ బ్రతుకులు అమూల్యాలు! మీ సుఖంకోసం మా జీవితాలు బలిచెయ్యాలి. కానీ యివన్నీ పైకి చెప్పే విషయాలు కావు. అందరికీ తెలిసిన సత్యసత్యాలు. పోనీ... పోనీ... పొరపాటయింది.... నువ్వు మంచిదానివని అరుణ అనుకున్నాను.... మనుషులు మారతారని తెలిసి గూడా ఎందుకింత పొరపాటు చేశానో అర్థం కాదు." రెండు చేతుల్లో తలపెట్టుకుని బాధగా అంది.

"కామూ!" రెండు చేతులెత్తి తలెత్తి పిల్చింది. కౌముది లేచి నిలబడింది.

"ఆ అమ్మాయి ఎవరు?"

"ఎవరైతేనేం?"

"చెప్పు.... చెప్పు...."

"పెద్దమ్మ కూతురు."

"ఆమెను చూడాలి."

"నన్ను నమ్మలేనన్నమాట!...సరే! పద."

• • •

"ఓ! అరుణాదేవిగారా! రండి! రండి!" అప్పుడే కారు దిగిన అరుణకూ, కౌముదికీ స్వాగతం పలికాడు కృష్ణమూర్తి. ఇద్దరూ లోపలికి వచ్చి చెరో కుర్చీమీద కూర్చున్నారు.

కృష్ణమూర్తి లోపలిగదిలోకి వెళ్ళాడు. కౌముది గది పరిశీలించి చూస్తోంది. అరుణ కూడా అందులో భాగం పంచుకుంది. ముచ్చటయిన గది, తెల్లని గోడలు. నాలుగ్గోడలూ భాగం పంచుకున్నట్లు ఒక్కోగోడకూ కనువిందు చేసే ఒక్కో దృశ్యం. ఓ మూలగా రోజ్‌వుడ్ టేబిలూ, టేబిలుమీద చందనపు చెక్కపై పెయింటుచేసిన బుద్ధ భగవానుని బొమ్మ. దాని క్రింద అమర్చిన కాలెండర్.

గది మధ్యన మరో టేబిలు, దానిమీద పూల టేబిలుక్లాతు. టేబిలు చుట్టూ నాలుగు కుర్చీలు. గది మరో మూల అద్దాల బీరువా, అద్దాల్లోనుండి కనిపిస్తున్న రకరకాల పుస్తకాలు.

మరో మూలగా ముక్కాలి పీటలూ, దానిమీద అందమైన ఫ్లవర్‌వాజూ, ఫ్లవర్ వాజ నిండుకూ మెత్తని తియ్యని గులాబీలూ. గదిలో అడుగు పెట్టగనే ఎదురుగా స్టాండ్‌మీద బాపూజీ పాలరాతి విగ్రహం.

"గది ఎలా ఉంది?" నుదుటిమీద ముత్యాల్లాంటి చెమట బిందువుల్ని తుడుచుకుంటూ నవ్వి అంది కౌముది.

"నాలుగుమూలలా కళాహృదయం తొంగి చూస్తున్నది." చేతిగుడ్డ నోటికి అడ్డుపెట్టుకుని మెల్లగా అంది అరుణ.

"అవునవును....మరో విషయం గమనించావో లేదో. కొంత మంది, అంటే ఎక్కువ తెలివి గలవాళ్ళు, కుటిల హృదయాలను దాచిపెట్టేందుకు మర్యాద, సానుభూతి, దయ ఎక్కువ పాళ్లలో కురిపిస్తారు. మనం ఆ చమ్కీ తెరలను చొచ్చుకుని లోపలికెళ్లి కుళ్ళిన హృదయాలను చూడలేమని పాపం వాళ్ల భావం కాబోలు! ఈయనగారి అతి మర్యాద...చూస్తున్నావుగా.."

"చాలు!...చాలు! కామూ! ఎంత బండగా మొరటుగా మాట్లాడతావే తల్లీ! అతను వస్తాడు...చాలించు."

కౌముది నవ్వి లోపలికి తొంగి చూసింది. తెర తొలగించుకొని కృష్ణమూర్తి గదిలోకి వచ్చాడు.

"ఇంట్లో ఎవరూ లేరనుకుంటాను..." అరుణ అడిగింది.

"పనికుర్రాడు తప్ప మరెవరూ లేరు." కుర్చీలో కూర్చుంటూ అన్నాడు.

"కౌముది, మీకు తెలుసుగదూ?"

"తెలికపోవడమేం?" కౌముది వంక చూసి మెల్లగా నవ్వి అన్నాడు.

కౌముది కృష్ణమూర్తి కన్నుల్లోకి సూటిగా



వీణాపాణి

చిత్రం—పి. దయాకుమారి (రాయచోటి)

చూసింది.

కృష్ణమూర్తి, అరుణ వైపు దృష్టి మరల్చి, "పనికుర్రాడితో చెప్పిపంపితే నేనే వచ్చేవాణ్ణిగా? మీ కెందు కింత శ్రమ?" అన్నాడు.

అరుణ, కౌముది ముఖంలోకి చూసింది.

"కార్లో రావడమూ శ్రమేనా? మీతో కాస్త పనుండి వచ్చాము" అంది కౌముది.

"అయితేమటుకేం? మాట్లాడాలి రమ్మంటే నేనే వచ్చేవాణ్ణిగా?"

"పర్వా లేదు." అరుణ ముక్తసరిగా అంది.

పనికుర్రాడు ట్రేలో కాఫీ సరంజామా పట్టుకువచ్చాడు.

'అతి మర్యాద.' కౌముది హృదయం మెల్లగా గొణిగింది.

కృష్ణమూర్తి కాఫీ కలిపి వాళ్లిద్దరికీ చెరో కప్పిచ్చి తనొకటి తీసుకున్నాడు. మరేం మాట్లాడక అందరూ కాఫీ త్రాగడం ముగించారు. అరుణ ఫాలభాగం చిరుచెమటతో తడిసిపోయింది. కౌముది, అరుణ ముఖంలోకి చూసి కృష్ణమూర్తి వైపు తిరిగి, "అరుణ చెప్పమంది...." అంటూ ఆగిపోయింది. సముఖంలో రాయబారాలెందుకో అర్థంకాక ఆశ్చర్యపోయాడు కృష్ణమూర్తి.

"ఈ పెళ్లి తన కిష్టంలేదట...."

కృష్ణమూర్తి చకితుడై అరుణ వైపు తిరిగి చూశాడు. చేతిరుమాలుతో నొసలద్దుకుంటూ గోడకు తగిలించి ఉన్న దృశ్యం వైపు దీక్షగా చూస్తున్నది అరుణ.

"కారణం తెలుసుకోవచ్చా,అరుణాదేవిగారూ?"

అరుణ కృష్ణమూర్తి కన్నుల్లోకి సూటిగా చూసి "మీకంతగా తెలుసుకోవాలనుంటే తప్పకుండా తెలుసుకోవచ్చు" అంది.

(తరువాయి 50 వ పేజీలో)

"తెలుసుకోవాలనే ఉంది." ఎర్రబడిన ముఖంతో అన్నాడు.

"ప్రేమ విషయంలో మీ అభిప్రాయమేమిటి?" కౌముది అడిగింది.

"దానికీ, దీనికీ సంబంధం?" కనుబొమలు చిట్లించి అడిగాడు కృష్ణమూర్తి.

"ఉంది!" కౌముది వచ్చే నవ్వును ఆపుకుని అంది.

"స్థిరమైన అభిప్రాయాలు లేవు."

"ఓ! అలాగా! అయితే మీరెప్పుడూ ఎవ్వరినీ ప్రేమించలేదుగాబోలు!" హేళనను దాచేందుకు

## మారిన మనసు

( 35 వ పేజీ తరువాయి)

సర్వప్రయత్నం చేసిన కౌముది చివరకు పట్టుబడక తప్పలేదు.

కృష్ణమూర్తి ముఖం మరీ ఎర్రబడింది. "ఈ ప్రశ్న అడిగేందుకేనా యింతదూరం వచ్చింది, అరుణాదేవిగారూ?" ఎర్రబడిన కన్నులను అరుణ వైపు తిప్పి అన్నాడు.




అరుణ చలించకుండా అవునన్నట్లు తలూపింది.

"కోపగించుకుంటే ఎలా చెప్పండి? ప్రేమ పట్ల మీకు ఓ అభిప్రాయమంటూ లేదంటున్నారు. కానీ అరుణకు చాలా గట్టి అభిప్రాయాలున్నాయి. ప్రేమించిన వ్యక్తిని తప్ప మరొకర్ని చేసుకోదట... అంటే అసలు ప్రేమించడమంటూ నిజంగా జరిగితే." ఓరగా కృష్ణమూర్తి వైపు చూసి అంది.

"ఊఁ...అయితే?"ముఖం చిట్లించి అన్నాడు.

"అరుణ ఓ సెకండరీగ్రేడ్ టీచర్‌ను ప్రేమించింది. అతన్నితప్ప మరొకర్ని చేసుకోదట." క్రీగంట అరుణ వైపు చూసి అంది కౌముది.

"ఆ విషయం నాతోకాదు చెప్పవలసింది, వాళ్ల నాన్నతో!" కోపాన్నంతా కళ్లల్లో నుంచి కుమ్మరిస్తూ అన్నాడు.

"అభ్యుదయకారులు, సహృదయులు మీరే అర్థంచేసుకోలేనిరోజు పాత పంథాలను విడవలేని వాళ్ల నాన్న అరుణ హృదయంలోని సంఘర్షణను ఎలా అర్థం చేసుకోగలరు చెప్పండి?"

అరుణ చేతిరుమాలు నోటి కడ్డుపెట్టుకుని కిటికీలోనుంచి దూరంగా చూస్తుండిపోయింది.

కృష్ణమూర్తి వివివిలాడుతూ లేచి కిటికీ దగ్గరికి వెళ్లి కిటికీ తలుపులు పట్టుకుని బయటకు చూస్తూ— "అయితే మీరనేదేమిటి?" అన్నాడు విసుగ్గా.

"ఏముంది? అరుణ నాన్నగారితో ఈపెళ్లి చేసుకోలేనని చెప్పండి!"

కృష్ణమూర్తి వెనక్కు తిరిగి ఇద్దరివైపూ చూసి "అసలి మీరే చేసుకోవచ్చు" అన్నాడు క్రోధంగా.

"మేమా! ఆహా.... చేసుకోవచ్చనుకోండి! కానీ వాళ్ల నాన్న ఊరుకుంటారటండీ! అరుణ తలవంచి మరీ మీచేత తాళి కట్టిస్తారు."

కృష్ణమూర్తి హృదయం హాయిగా శ్వాస తీసుకుంది. "అలాగే కానివ్వండి!" క్రింది పెదవి నొక్కి అరుణవైపు క్రీగంట చూసి అన్నాడు.

"మనసులేని మనువు మీకుమటుకేం సుఖం?"

"ప్రపంచంలో మనసున్న మనువులే జరుగుతున్నాయా? అలా అయితే అసలు పెళ్లిళ్ల జరగవు!" వ్యంగ్యంగా నవ్వి అన్నాడు.

"మా ఖర్మం! చెప్పవలసింది చెప్పాను. అరుణ ప్రాణాలే తీసుకుంటుందేమో మా కర్మం కష్టం." తల వంచుకుని మెల్లగా గొణిగింది కౌముది.

కృష్ణమూర్తి తలెత్తి ఆశ్చర్యంగా ఇద్దరివైపూ చూశాడు. "ఇది నాటకం కాదుగదా?" రెండు క్షణాల తర్వాత అన్నాడు.

"నాటకమా! అవును నాటకమే!" తనలో తనే గొణుక్కుంది అరుణ.

కృష్ణమూర్తి ఆలోచిస్తూ కూర్చున్నాడు. "ప్రేమపట్ల మీలాగే నాకూ స్థిరమైన అభిప్రాయాలు లేవు. కానీ అరుణను చూశాక

వేల సంవత్సరాలుగా కవులచే గానం చేయబడిన ప్రేమ యీ కలియుగంలోకూడా ఉందని నమ్మవలసి వస్తున్నది. ఆడవాళ్ల హృదయాలు మీ కర్థం కావనుకుంటాను కృష్ణమూర్తిగారూ! అర్థం చేసుకోవడంగూడా చాలా కష్టమే అనుకోండి!"

కృష్ణమూర్తి కొరకొరా చూశాడు కౌముది ముఖంలోకి.

"సుఖమూ, ఐశ్వర్యమూ, జీవితమూ స్త్రీ దృష్టిలో చాలా అల్పంగా పరిగణింపబడతాయి. కానీ మీకు సుఖం కావాలి. ఐశ్వర్యం కావాలి. ఇవి అనుభవించేందుకు జీవితం కావాలి! అందుకే స్త్రీ ఎప్పుడూ త్యాగం చేస్తుంది. పురుషుడు ఆ ఫలాన్ని అనుభవిస్తాడు. దీనికి ఉదాహరణ అవసరం లేదనుకుంటాను. మనం రోజా చూస్తూనే వున్నాము."

"అవును." కఠినంగా అన్నాడు కృష్ణమూర్తి.

"మీరు నమ్ముతారో నమ్మరో...."

"ఏమిటి?"

"విశాఖపట్నంలో నాకో స్నేహితురాలుంది. ఆ అమ్మాయి జీవితం అచ్చు కథలాగే ఉంటుంది. తనకు నెరిపిందల్లా త్యాగం చెయ్యడమే."

"జీవితాలేగా కథలుగా వ్రాస్తారు?" నవ్వి అన్నాడు కృష్ణమూర్తి.

"నాకు ప్రాణస్నేహితురాలు...పేరు సుజాత."

కృష్ణమూర్తి అదిరిపడి తమాయించుకున్నాడు.

"ఎవర్నో ప్రేమించిందట.... అతనూ ప్రేమించాడట. అహా.... అలా నటించాడట...."

"ఊఁ...."

అరుణ శ్రోతగానే ఉండిపోయింది. కౌముది ఓరగా చూసింది. కృష్ణమూర్తి కనుకొలకుల్లో నుంచి చూస్తున్నాడు. చప్పున ఇద్దరూ చూపులు త్రిప్పుకున్నారు.

"పున్నమి చంద్రుని సమక్షంలో ఉంగరాలు మార్చుకుని పెండ్లయిందనిపించారట!" అన్నది కౌముది.

కృష్ణమూర్తి ముఖం పాలిపోయింది. కౌముది అరుణ ముఖంలోకి చూసింది. అరుణ కళ్లతోనే ఏదో చెప్పింది.

"నాలుగు సంవత్సరాలు గడిచాయి. అప్పటికి ఇద్దరి బిడ్డల తండ్రి కావడం, ఎమ్. ఎ. పాసు కావడం జరిగాయి. ఆమెకు చెప్పకుండానే పిహెచ్. డి. చేసేందుకు బెనారస్ వెళ్లాడట! వందలకొద్దీ ఉత్తరాలు వ్రాసినా జవాబు మచ్చుకు రాలేదు. రెండు సంవత్సరాలు రెండు యుగాలుగా గడిచింది. అతను పిహెచ్. డి. కాగానే మరో పెళ్లిప్రయత్నం చేస్తున్నాడని ఆమెకు తెలిసింది. బాగా డబ్బొస్తుందట! ఉన్నపే ఎక్కడో ఉద్యోగం చేస్తున్నాట్ట."

కృష్ణమూర్తి ఎటో చూస్తున్నాడు.

"అభిమానవతియైన సుజాతకు మరోదారి లేదు. విషం తీసుకుంది."

కృష్ణమూర్తి ఉలిక్కిపడి లేచి నిల్చున్నాడు.



అడయారు వట వృక్షం (మద్రాసు) ఫోటో—ఎల్. ఎల్. రాజ్‌పాల్ (బొంబాయి-1)

"ఏమిటి?"

"సుజాత విషం తీసుకుంది."

"నిజం?" ఆత్రంగా అన్నాడు.

"నిజమే!"

కృష్ణమూర్తి అలాగే నిల్చున్నాడు శిల్పంలా కదలిక లేకుండా. నిశ్శబ్దంగా కొన్ని నిమిషాలు గడిచాయి. అరుణ మనఃపూర్వకంగానే గొంతు సర్దుకొని చప్పుడు చేసింది.

కృష్ణమూర్తిలో చలనం లేదు.

"కృష్ణమూర్తిగారూ!" కౌముది పెద్దగా పిలిచింది.

కృష్ణమూర్తి, కౌముది ముఖంలోకి చూశాడు.

"ఏమిటలా అయిపోయారు? సుజాత మీకు తెలుసేమిటి?"

కృష్ణమూర్తి అదోరకంగా కౌముది ముఖంలోకి చూసి తల మరోవైపు త్రిప్పుకొని, "నాకు తెలుసని మీకు తెలుసు" అన్నాడు.

కౌముది, అరుణ ఒకరి ముఖంలో ఒకరు చూసుకున్నారు.

"మీరేమిటో అంటున్నారు...." అరుణ ఏదో చెప్పబోయింది.

"అరుణాదేవిగారూ! ఇక మీరేం చెప్పొద్దు... మీ నాన్నగారితో మీరు చెప్పమన్నట్లే చెబుతాను.... దయచేసి నన్ను ఒంటరిగా విడిచి వెళ్లండి!" కణతలు రెండూ నొక్కుకుని బాధగా అన్నాడు.

అరుణా, కౌముదీ లేచి వరండాలోకి వచ్చారు. వరండాలో నిల్చుని ఉన్న సుజాత, కౌముది ముఖంలోకి చూసింది. కౌముది నవ్వి తలూపింది. సుజాత లోపలికి అడుగేసింది. కృష్ణమూర్తి సుజాతకేసి గుడ్లప్పగించి చూస్తూండిపోయాడు.

"ఏమిటలా చూస్తున్నారు? నేను గుర్తులేనా?" నీరసంగా నవ్వి అంది సుజాత.

"నువ్వు.... నువ్వు....."

"సుజాతను!"

"చనిపోలేదా?"

"ఎవరు చెప్పారు?"

"కౌముదిగారు."

"ఏమని?"

"విషం తీసుకున్నావని."

"చనిపోయానని చెప్పలేదుగా?" కన్నీటితో కృష్ణమూర్తి వైపు చూసి అంది.

కృష్ణమూర్తి హాయిగా నవ్వాడు. "సుజా! నన్ను క్షమించగలవా?" సుజాత కళ్లెత్తి కృష్ణమూర్తి వైపు చూసి నవ్వింది.

"నా డబ్బుదాహానికి నిన్ను బలిగా తీసుకున్నానేమో అని తల్లడిల్లిపోయాను. నువ్వు బ్రతికున్నావు. అంతే చాలు! డబ్బుకు మనుషుల మీద యింత ప్రభావ ముంటుందని ఎవరనుకుంటారు, సుజా? భగవన్! నన్నీ పాపకూపం నుంచి రక్షించావు!" కళ్లు మూసుకుని బరువుగా నిట్టూర్చి అన్నాడు.

"అరుణాదేవిగారి మాట మరిచిపోతున్నారు!" భర్త కన్నుల్లోకి ప్రేమగా చూసి అంది సుజాత.

"అవును.... ఆమె నా అమానుష హృదయంలో మానవత్వపు దివ్వెలను వెలిగించిన దేవత! ఆమె వెన్నెల... ఆమె వెలుగు! సుజా! ఈ హృదయంలో మానవత్వం మాసిపోకుండా చూడవలసిన బాధ్యత ఇకమీదట నీమీద వేస్తున్నాను సుమా!" సుజాతను దగ్గరకు తీసుకుంటూ అన్నాడు.